క్లుప్తంగా

వార్డుల్లో చైర్‌పర్సన్ పర్యటన



బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని 5, 6 వార్డుల్లో డ్రెయినేజీ సమస్యను చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డ్రెయినేజీ సమస్య తమ దృష్టికి వచ్చిందని, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. కౌన్సిలర్లు షాహుల్, రహమత్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల ఫిర్యాదు

- పోలీస్‌స్టేషన్‌కు ట్రావెల్స్ బస్సు తరలింపు



వెంకటాచలం: మండలంలోని వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద నెల్లూరు వైపు వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సును పోలీసులు గురువారం తెల్లవారుజామున పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలు.. నెల్లూరుకు చెందిన పలువురు అయ్యప్ప భక్తులు దైవ దర్శనానికి తిరుమలకు కావేరి ట్రావెల్స్ బస్సులో వెళ్లారు. తిరిగి వచ్చే సరికి బస్సు లేకపోవడం, డ్రైవర్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో భక్తులు 112 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు వెంకటాచలం టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని బస్సును స్వాధీనం చేసుకున్నారు.

రామాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జనార్దన్

కొడవలూరు: మండలంలోని రామాపురంలో యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జనార్దన్ పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎస్ సురేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, ఏఎన్ఎం సరిత, హెచ్‌ఏ సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో పంట ధ్వంసం



వరి పంటలో పడిన కొబ్బరి చెట్టు

ఇందుకూరుపేట: మైపాడు – నెల్లూరు రోడ్డు విస్తరణలో భాగంగా తమ పంటను ధ్వంసం చేశారని ఇందుకూరుపేటకు చెందిన రైతు షేక్ అన్సర్ వాపోయాడు. మొత్తలు గ్రామంలో తనకు పొలం ఉందని, అయితే ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కొబ్బరిచెట్లను ధ్వంసం చేయడంతో పాటు ఆ చెట్లను తన పొలంలో తోసి పంటను ధ్వంసం చేశారన్నారు. తనకు న్యాయం చేయాలని గురువారం కోరాడు.

బాబా మందిరంలో విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మందిరంలో భజనలు జరిగాయి. రాత్రి పల్లకి సేవ నిర్వహించారు.

'సూపర్' మోసం

- కూటమి ప్రభుత్వంలో ప్రజలకు దక్కని ఆసరా
- ఆరునెలలైనా ఊసే లేని పథకాలు
- వ్యవసాయ పనులకు పెట్టుబడుల్లేవు
- అమలుకు నోచుకోని 'అన్నదాతా సుఖీభవ'

మోసం చేయడం.. ఇదొక్కటే సీఎం చంద్రబాబుకు తెలిసింది. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చారు. తీరా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నారు. అన్నదాతల గురించి ఈ సర్కారు పట్టించుకున్న పాపాన పోలేదు. వారికి సాయం చేసేందుకు ఇంత వరకు ముందుకు రాలేదు.





పొదలకూరు: అధికారమే పరమావధిగా కూటమి పెద్దలు ఎన్నికల ప్రచారంలో ఎన్నో పథకాలను ప్రకటించారు. హామీలను నెరవేర్చి పేదలకు సాయం చేస్తామని ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసే ఎత్తకుండా నిత్యం పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు సూపర్‌సిక్స్ పథకాల కోసం ఎదురు చూస్తుండగా ఈ ఆరునెలల పాలనలో ఏమీ చేయకపోవంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు సేద్యాలకు పెట్టుబడులు, పిల్లలను పాఠశాలలకు పంపుతున్న తల్లిదండ్రులు తల్లికి వందనంపై ఆశలు పెట్టుకున్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేల కోసం యువత, 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి మహిళ నెలకు రూ.1,500 వస్తుందని, ఉచిత బస్సు ప్రయాణం చేద్దామని ఎదురు చూస్తుండగా ఆరునెలల పాలనలో ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తే తమపై భారం తగ్గుతుందని మహిళలు వేచి చూశారు. అయితే ఈ సంవత్సరానికి సగం మందికే ఒక్క గ్యాస్ సిలిండర్ అందజేసి మమ అనిపించారు. రూట్ మ్యాప్ పేరుతో కొంతకాలం, డైవర్షన్ పాలిటిక్స్‌తో మరికొంతకాలం వెళ్లదీస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆర్థిక ఇబ్బందులంటూ చంద్రబాబు ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం జరుగుతున్నట్టు గ్రహించి సూపర్ సిక్స్ పథకాలను వెంటనే పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నాడు పక్కాగా..

రబీ సీజన్‌లో అయినా అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు బదిలీ జరుగుతుందని సన్న, చిన్న కారు రైతులు ఆశించారు. అయితే దీనిపై స్పష్టత లేదు. ముమ్మరంగా వరినాట్లు జరుగుతున్న తరుణంలో చిన్న కమతాల్లో తిండి గింజలు పండించుకునేందుకు పేద రైతులు అప్పులు చేసి వరినాట్లు వేసుకుంటున్నారు. గత ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఏడాదికి అర్హులైన ఒక్కొక్క రైతుకు రూ.13,500 వంతున పెట్టుబడి సాయం చేసింది. అదే పథకాన్ని కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవగా మార్చి ఏడాదికి రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇప్పటి వరకు పట్టించుకోకపోవడంతో రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. ఖరీఫ్ సీజన్‌లో అందిస్తారనుకున్న రైతులకు నిరాశే మిగలగా రబీలో అదే పరిస్థితి ఎదురైంది. దీంతో బ్యాంక్‌లు, దొరికిన చోట్ల అప్పులు చేసి వ్యవసాయ పనులు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో..	
సర్వేపల్లి నియోజకవర్గంలో రైతులు	: 30,242 మంది
అందిన సాయం	: రూ.105.85 కోట్లు

పెట్టుబడి ఇచ్చేదెప్పుడు?



గతంలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఈపాటికే రైతు భరోసా అర్హులందరికీ ఇచ్చారు. ప్రతి సంవత్సరం చెప్పిన సమయానికల్లా పెట్టుబడి సాయం చేయడంతో రైతులు సంతోషంగా పంటలు పండించుకున్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తలేదు.

– కె.శేఖర్‌రెడ్డి, వరిగొండ, తోటపల్లిగూడూరు మండలం

సాయం అందలేదు



రైతుకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి తొలివిడత అన్నదాతా సుఖీభవ సాయం అందనే లేదు. ఖరీఫ్ గడిచిపోయి రబీ జరుగుతున్నా సాయం అందుతుందన్న నమ్మకం లేదు. సీఎం చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పదేపదే మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తే రైతులకు సాయం అందేలా లేదు. గతంలో జగన్ రైతు భరోసా పేరుతో మే నెలలోనే సాయం చేసేవారు.

– జి.నారాయణరెడ్డి, పులికల్లు, పొదలకూరు మండలం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపు తప్పడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని కనుపూరు సమీపంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోవూరుకు చెందిన ఇబ్రహీం, కరిముల్లా కసుమూరు దర్గాకు బైక్‌పై వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో కనుపూరు సమీపంలో మలుపు రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో వారిద్దరూ గాయపడగా స్థానికులు వెంకటాచలంలోని క్లస్టర్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసుల నమోదు

పొదలకూరు: పట్టణంలోని రామనగర్‌గేటు సెంటరులో వివాదంలో ఉన్న స్థలంలో దేవుడి విగ్రహం ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని ఒక కేసు, స్థలం తమదని పరిశీలనకు వస్తున్న వారిపై దౌర్జన్యం చేశారని మరో కేసును బుధవారం రాత్రి ఎస్సై హనీఫ్ నమోదు చేశారు. ఆయన కథనం మేరకు.. గేటుసెంటరులో చాలా ఏళ్లుగా ఓ స్థలం వివాదంలో ఉంది. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న యువకులు అదే స్థలంలో గుడి నిర్మించి రాత్రి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. స్థలంపై కోర్టుకెళ్లిన మోహన్‌కృష్ణ ఫిర్యాదు మేరకు వాకాటి శ్రీనివాసులురెడ్డి మరికొంత మందిపై కేసులు నమోదు చేశారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



బుచ్చిరెడ్డిపాళెం: మాట్లాడుతున్న విద్యారమ



మనుబోలు: మాట్లాడుతున్న ఎంపీడీఓ

బుచ్చిరెడ్డిపాళెం : సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి విద్యారమ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్యారమ హాజరై, మాట్లాడారు. దేశంలోని కేరళ, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు మాత్రమే గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో ముందంజలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరి, పంచాయతీ విస్తరణాధికారి నారాయణరెడ్డి, డీపీఆర్సీ సభ్యుడు అజీజ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

మనుబోలు: గ్రామాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ జలజాక్షి గ్రామ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందికి సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆదాయవనరులపై దృష్టి సారించాలని సూచించారు. ఇంటి పన్నులు సక్రమంగా వసూలు చేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మశ్రీ, రమణమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనానాయక్, వనజాక్షి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

- **తోటపల్లిగూడూరు:** ప్రభుత్వ సిబ్బంది సమన్వయంతో పనిచేసి పల్లెలను ప్రగతిపథంలో నడిపించాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఎంపీడీఓ మాట్లాడారు.

ఘనంగా ప్రసన్న పుట్టినరోజు

కోవూరు : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను కోవూరులో పార్టీ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద డీఏఏబీ మాజీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. పార్టీ నేతలు రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, శ్రీలత, శివుని నరసింహులురెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, లక్ష్మీకుమారి, పుచ్చలపల్లి వెంకట రమణారెడ్డి, అనూప్‌రెడ్డి, శివారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **బుచ్చిరెడ్డిపాళెం:** స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రసన్నకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పార్టీ పట్టణాధ్యక్షుడు టి.మల్లికార్జున్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పార్టీ నేతలు ఇప్పగుంట విజయ్‌భాస్కర్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, అల్లాభక్షు, పి.శ్రీనివాసులురెడ్డి, పిడుగు మధులతో పాటు కౌన్సిలర్లు షాహుల్, షకీలా, మల్లారెడ్డి, యానాదిరెడ్డి, అనంతమ్మ, ప్రమీలమ్మ, ఎం.జ్యోతి, కో–ఆప్షన్ సభ్యుడు ఇర్షాద్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



కోవూరు : సీహెచ్‌సీలో రొట్టెలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



బుచ్చిరెడ్డిపాళెంలో..

క్షయపై అప్రమత్తత అవసరం

కొడవలూరు : రక్తహీనత, క్షయ, కుష్టుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో వ్యవహరించాలని అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. మండలంలోని నార్నురాజుపాళెం జెడ్పీ హైస్కూల్‌లో రక్తహీనత, క్షయ, కుష్టులపై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిపై స్పర్శలేని మచ్చలుంటే విధిగా వైద్యుడిని సంప్రదించాలన్నారు. రక్తహీనతను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందన్నారు. కొడవలూరు వైద్యాధికారి జి.బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్ఎస్ వి.రామ్మోహన్, ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

మత్స్య కళాశాలలో ఆక్వాపై అవగాహన నేడు

ముత్తుకూరు: ముత్తుకూరులోని మత్స్య కళాశాలలో శుక్రవారం ఉదయం 'అవేర్‌నెస్ కమ్ ఫీల్డ్ డెమాన్‌స్ట్రేషన్ ప్రోగ్రామ్ ఆన్ ఇంటిగ్రేటెడ్ ఆక్వా సిస్టమ్స్' అనే అంశంపై సమావేశం జరుగుతుందని అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

జయప్రదం చేయండి

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం ఉదయం నెల్లూరులో జరిగే 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలంటూ ఆ పార్టీ బుచ్చి పట్టణ, రూరల్ అధ్యక్షులు టి.మల్లికార్జున్‌రెడ్డి, సీహెచ్.సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు ఈ ధర్నాలో పాల్గొనాలని గురువారం విజ్ఞప్తి చేశారు.

గృహ సర్వే తప్పనిసరి



మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు

ఇందుకూరుపేట: ప్రతి కుటుంబం తప్పనిసరిగా గృహ సర్వే చేయించుకోవాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు అన్నారు. కొత్తూరు సచివాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హౌస్ హోల్డ్ సర్వే ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసి, పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ నాగేంద్రబాబు ఉన్నారు.

తీరానికి కర్రల బోటు



ఇందుకూరుపేట: మైపాడు తీరానికి కర్రలతో తయారు చేసిన బోటు గురువారం కొట్టుకొచ్చింది. ఈ బోటు పొరుగు జిల్లాల్లో చేపల వేటకు ఉపయోగిస్తారని, సముద్రం కసురుగా ఉండడంతో కొట్టుకు వచ్చిందని స్థానిక మత్స్యకారులు చెప్పారు. కాగా అల్పపీడన ప్రభావంతో మైపాడు తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి.

దిగజారిన నిమ్మ ధరలు



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

- బస్తా కాయలు రూ.1,600

పొదలకూరు: చలితీవ్రత, వర్షాల వల్ల నిమ్మకాయల వాడకం తగ్గిపోయి రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. నిన్నటి వరకు అధికంగా రూ.2,500 వరకు ధర పలికింది. అయితే ప్రస్తుతం కిలోల వంతున పరిశీలిస్తే రూ.15 నుంచి రూ.20 మాత్రమే ధరలున్నాయి. బస్తా (లూజు) లెక్క అయితే రూ.1,200 నుంచి రూ.1,600 వరకు ఉన్నట్టు వ్యాపారులు వెల్లడించారు. వర్షాకాలంలో ప్రస్తుతం ఉన్న ధరలు తక్కువ కాదంటున్నారు. అయితే నాణ్యత కలిగిన నిమ్మకాయలకే ఈ ధరలు వర్తిస్తాయని వెల్లడించారు. మంచు ప్రభావంతో కాయల్లో నాణ్యత లోపించి గిట్టుబాటు ధరలు లభించడం లేదు. వరుస తుఫాన్ల వల్ల జడివానలు పట్టుకుని తోటల్లో వర్షపునీరు చేరింది. రైతులు ఇప్పుడిప్పుడే వెళ్లి కాయలు కోయిస్తున్నారు. తిరిగి గురువారం భారీ వర్షం కురవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి వరకు తోటలకు నీరు పెట్టే అవసరం లేకుండా వర్షం కురిసినట్టు తెలుస్తోంది. అంతేకాక మోటార్లు వేసి తోటలకు నీరు పెట్టే అవసరం చాలామందికి ఏర్పడలేదు.

పెరిగిన ఎగుమతులు

నిమ్మకాయల ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. దీంతో ఢిల్లీ మార్కెట్లో ధరలు తగ్గుతున్నట్టు వ్యాపారులు తెలిపారు. ఇక్కడి నుంచే కాక కర్ణాటక రాష్ట్రం బిజాపూర్ నుంచి కాయల ఎగుమతులు బాగా పెరగడంతో ఉత్తర భారతదేశంలో కాయలకు డిమాండ్ కూడా అదే స్థాయిలో తగ్గుతున్నట్టు తెలుస్తోంది. ఆంధ్రా నుంచి తెనాలి, ఏలూరు మార్కెట్ల నుంచి కూడా నిమ్మకాయల డిమాండ్‌కు మించి ఎగమతులు జరుగుతున్నాయి.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



మనుబోలు: అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్బయ్య



పొదలకూరు: సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్

ముత్తుకూరు: మండలంలోని పైనాపురంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో 13 అర్జీలు వచ్చాయి. పాస్ పుస్తకాలు, అడంగళ్ కాపీల కోసం స్థానికులు ఈ అర్జీలు ఇచ్చారు. రీ సర్వే డీటీ శ్రీనివాసులు, సర్వేయర్ అనురూప్, వీఆర్వో అజయ్ బాబు, సర్పంచ్ మునుకూరు జనార్దనరెడ్డి, కావలి విజయకుమార్‌లు పాల్గొన్నారు.

- **పొదలకూరు:** మండలంలోని ప్రభగిరిపట్నంలో గురువారం తహసీల్దార్ బి.శివకృష్ణ సదస్సును నిర్వహించారు. రైతుల నుంచి ఆరు వినతి పత్రాలు అందాయి. పొలాలకు దారులు, పట్టా భూములు ప్రభుత్వ భూమిగా చూపుతున్నాయని, సర్వే నంబర్లు కనిపించడం లేదని తదితర సమస్యలపై అర్జీలను అందజేశారు. మండల సర్వేయర్ గోపీనాథ్, వీఆర్వో శారద, అశోక్ తదితరులు పాల్గొన్నారు.
- **మనుబోలు:** మండలంలోని వడ్లపూడి గ్రామంలో సదస్సు జరిగింది. తహసీల్దార్ సుబ్బయ్య మాట్లాడుతూ వడ్లపూడి నుంచి 11, వీరంపల్లి నుంచి 7 అర్జీలు అందినట్లు తెలిపారు. సర్పంచ్ రమాదేవి, సర్వేయర్ కిశోర్, ఆర్ఐ నారాయణ, వీఆర్వో మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులిలా.. రాకపోకలు ఎలా?

మనుబోలు: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే తారురోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా వీటిపై వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. పాదచారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే గుంతలమయంగా ఉన్నాయి. ఇక వర్షం కురిస్తే నీరు చేరి బురదమయంగా మారుతున్నాయి. మనుబోలు, పిడూరు, కాగితాలపూరు, బండేపల్లి, చెర్లోపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్లు చాలా దారుణంగా ఉన్నాయి. హైవే పక్కల సైతం వర్షపునీరు చేరి గుంతలయమంగా ఉంది. మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



గుంతలమయంగా పిడూరు రోడ్డు



అధ్వానంగా బండేపల్లి రోడ్డు



హైవే పక్కన గుంతలు

పంటల బీమా తప్పనిసరి

కోవూరు: రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సుజాత కోరారు. మండలంలోని గుమ్మళ్లదిబ్బలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట బీమా ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ఏఓ ఇందిరావతి, వీఏఏలు మెహరున్నీసా, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉల్లికోడును నివారించుకోవాలి

కొడవలూరు: వరిలో ఉల్లికోడు తెగులు ఆశించి ఉన్నందున కార్బో ఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరానికి పది కిలోల వంతున చల్లుకోవాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని తాటాకుల దిన్నెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో జింక్ లోపం నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములను లీటరు నీటితో పిచికారీ చేసుకోవాలన్నారు. వీఏఏ జి.మౌర్య, రైతులు పాల్గొన్నారు.



కొడవలూరు : తాటాకుల దిన్నెలో..